క్లుప్తంగా

బీజేపీ టికెట్ కేటాయించాలని దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న కె.రవిచారి

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ టికెట్‌ను తనకు కేటాయించాలని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి బీజేపీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. గత అనేక పర్యాయాలుగా ముషీరాబాద్ నుంచి పోటీచేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్ ఈ దఫా పోటీచేయకపోతే ఆ టికెట్‌ను తనకు కేటాయించాలన్నారు. పార్టీ నియమనిబంధనలు, క్రమశిక్షణకు కట్టుబడి ఉంటున్నామని తమకు అవకాశం కల్పిస్తే తప్పకుండా గెలుస్తామన్నారు. బీజేపీ నాయకులు గడ్డం నవీన్, మంగళ, నరేష్ తదితరులున్నారు.

ఆంక్షల పేరుతో ఇబ్బందులు పెట్టొద్దు



నియామకపత్రాన్ని అందజేస్తున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: ఆంక్షల పేరుతో గణేష్ ఉత్సవ మండపాల నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేయొద్దని భాగ్యనగర్ సమితి ముషీరాబాద్ నియోజవర్గం కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పోలీసులను కోరారు. ఉత్సవాల విజయవంతానికి పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వినాయక చతుర్థి- 2023 భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి గాంధీనగర్ డివిజన్ కన్వీనర్‌గా దోనేటి సత్యం, కో-కన్వీనర్‌గా కృష్ణ చతుర్వేదీని నియమించారు. ఈ సందర్భంగా వారికి బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. సంప్రదించాల్సిన నంబరు 7799619991.

మూసారాంబాగ్ బ్రిడ్జిపై వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగింపజేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అంబర్‌పేట: మూసారాంబాగ్ బ్రిడ్జిపై పేరుకుపోయిన వ్యర్థాలను జీహెచ్ఎంసీ అధికారులు యుద్ధప్రాతిపాదికన తొలగించారు. కురిసిన భారీవర్షాలతో బ్రిడ్జిపై భారీగా వ్యర్థాలు పేరుకుపోయాయి. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ అధికారులు వాటిని తొలగించి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని డీఎంసీ మారుతి దివాకర్ దగ్గరుండి పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే టికెట్లకు విద్యార్థి నేతల దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓయూ విద్యార్థి నేతలు దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని నాటి నుంచి పార్టీలలో పని చేస్తున్న సుమారు 50 మందికి పైగా విద్యార్థి నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించాలని వినతి పత్రాలు సమర్పించారు. పోటీ చేసే అవకాశం లభిస్తుందో లేదోనని విద్యార్థి నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.

గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ



కాకతీయ హైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ పరిధిలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి మురిసిపోయారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొని సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు.

– అంబర్‌పేట్, ముషీరాబాద్ జోన్ బృందం



గోపిక వేషధారణలో..



కృష్ణుడి వేషధారణలో చిన్నారి అన్విక





కృష్ణుడి వేషధారణలో అనంత్ సాయి, హర్షవర్ధన్



సత్యభామ వేషధారణలో చిన్నారి



అంబేద్కర్ పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు



అంబర్‌పేట్‌లో చిన్నారి పవిత్ర

గురుదేవోభవ పురస్కారం ప్రదానం



పురస్కార గ్రహీతలతో బీజేపీ నాయకురాలు గీతామూర్తి

చిక్కడపల్లి: గురువు లేని విశ్వాన్ని ఊహించలేమని, ఈ ప్రపంచానికి దారి చూపిన గొప్ప వ్యక్తి గురువు అని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. తెలంగాణ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో బుధవారం సీల్‌వెల్ గురుదేవోభవ పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. అసాంఘిక పోకడలను అరికట్టి దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులు దేశానికి తక్షణం అవసరమన్నారు. అరోరా లీగల్ అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ బాస్కర్‌రెడ్డి, యాదాద్రిజిల్లా వావిళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నూరేళ్లి పారిజాత, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గుమ్మకొండ శ్రీనివాస్, ప్రముఖ నాట్య కళాకారిణి రాధిక శ్రీనివాస్‌లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్, సుజాత, ఇందినయన, విరాట్, ప్రాగ్నిక, విశిష్ఠ, పురుషోత్తం తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కును అందజేస్తున్న పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు

నల్లకుంట: జామై ఉస్మానియా అపోలో గ్రామర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అశ్విని భర్త కిశోర్ ఇటీవల మృతి చెందారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారి కుమార్తె వివాహం ఇటీవల నిశ్చయమైంది. కాగా విషయం తెలుసుకున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కే. సురేష్‌చందర్‌రావు దాతల సహకారంతో ఆమె కుమార్తె వివాహానికి ఆర్థికసాయాన్ని సమకూర్చారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పీవీ తనయుడు, పీ వీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు చెక్కును ఆమెకు అందజేశారు. ప్రముఖ సంఘ సేవకులు, దాత మురళీధర్ రావు, టీబీఎస్ఎస్ ప్రతినిధులు అశోక్‌కుమార్, సీహెచ్.మురళీ కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు మంచాల, ఉపాధ్యాయులు ఎస్‌వీ. లక్ష్మి, జయంతి, అశ్విని, వాణి, అనూష, ఉమాదేవి, విజయలక్ష్మి తదితరులున్నారు.

ఎస్‌ఎన్‌డీపీ నిధుల వినియోగంపై వినతి

నిధులు వృధా అయ్యాయని ఆరోపణ



జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌డీపీ) కింద నగరంలో రూ.900 కోట్లతో చేపట్టిన నిధులు వృధా అయ్యాయని టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు ఆరోపించారు. భారీ వర్షాలకు నియోజకవర్గంలో ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టిన అభివృద్ధి పనులు ఉపయోగంలోకి రాలేదని, నిధులు వృధా అయ్యాయని విమర్శించారు. దీనిపై జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా.. ఆయన అందుబాటులో లేకపోవడంతో చీఫ్ ఇంజనీర్‌కు అందజేశామన్నారు. ప్రతి ఏటా అరుంధతీనగర్, సబర్మతీనగర్, దామోదర సంజీవయ్యనగర్, బాపూజీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందన్నారు. పద్మకాలనీలో 6 నెలలకే పూర్తిచేస్తామన్న నాలాపై బ్రిడ్జి ఇంత వరకు పూర్తి కాకపోవడంతో ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుందన్నారు. కూలిపోయిన ఇళ్లకు రూ.3 లక్షలు, ఇళ్లల్లో నీరు చేరిన వారికి రూ.25 వేల తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో రిటైర్నింగ్ వాల్ నిర్మిస్తే మహిళ గల్లంతయ్యేది కాదని అభిప్రాయపడ్డారు.

మూడోరోజుకు చేరిన ‘పెన్‌డౌన్’

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు 12 వర్సిటీలకు వ్యాపించినట్లు జేఏసీ నాయకులు విజేందర్‌రెడ్డి అన్నారు. పెన్‌డౌన్, చాక్‌డౌన్ ఆందోళన కార్యక్రమాలు బుధవారంతో మూడో రోజుకు చేరాయి. రాష్ట్రంలో గురుకుల కళాశాలతో పాటు ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నికల్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేసి కేవలం వర్సిటీల అధ్యాపకులను పక్కన పెట్టడం సరికాదన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన కాంట్రాక్టు అధ్యాపకుల కుటుంబాలను ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు.

ఘనంగా బైరు మల్లయ్య వర్ధంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లుగీతా కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు బైరు మల్లయ్య అని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బైరు మల్లయ్య 3వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గీత కార్మికులతో పాటు సంస్థ శ్రమ జీవుల హక్కుల కోసం పొరాడారని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా తనవంతు పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు. గీత కార్మికులకు సొసైటీలను ఏర్పాటు చేయడంలో మల్లయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకన్నగౌడ్, రాములు, ఆశయ్య, భిక్షం, రమేష్, శ్రీరామ్‌నాయక్, వెంకటనర్సయ్య, గుమ్మడి రాజునరేష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బుర్జుగల్లీలో రూ.22 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను పెద్దఎత్తున చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయాల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి సమగ్రాభివృద్ధి చేశామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షోభంలో విద్యారంగం



మాట్లాడుతున్న కార్యదర్శి నాగరాజు తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో విద్యారంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షోభంలోకి తీసుకెళ్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజులు తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ విద్య వరకు సంక్షోభంలో ఉందన్నారు. పాఠశాల విద్యలో 24 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 5,609 పోస్టులకు డీఎస్‌సీని ప్రకటించి ఖాళీల విషయంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో సైతం టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్న ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గురుకులాలు, కేజీబీవీలలో సైతం అనేక ఖాళీలు ఉన్నాయని ఇప్పటికి పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వలేదన్నారు. ఈనెల 8,9,10వ తేదీల్లో సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్య అతిథులుగా అఖిల భారత ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు వీ.పీ.సాను హాజరవుతారన్నారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన్, స్టాలిన్ తదితరులున్నారు.

స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలు వెలకట్టలేనివి



రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ స్వచ్ఛ ఆటో కార్మికులకు రేయిన్ కోట్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటోకార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచారన్నారు. జీహెచ్‌సీ సర్కిల్- 15 ఎఎంఓహెచ్ మైత్రేయి, బీఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ అధ్యక్షుడు ఎం.రాజేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీష్ బాబు, రవిశంకర్‌గుప్తా, గడ్డమీది శ్రీనివాస్, సత్యనారాయణ, పి.రవి, రాజ్‌కుమార్, హెచ్.హనుమంతు, సుధాకర్, జహంగీర్, దేవయ్య తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ముషీరాబాద్: ఎమ్మెల్యే ముఠా గోపాల్ జన్మదిన వేడుకలు రాంనగర్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. యువ నాయకులు ముఠా జైసింహ, మన్నె దామోదర్‌రెడ్డి, ముదిగొండ మురళీ, ప్రవీణ్‌ముదిరాజ్, ఆర్.వివేక్, గోక నవీన్, పి.విజయకృష్ణ, జ్ఞానేశ్వర్‌గౌడ్, డేవిడ్ రాజు, మధు, మనోజ్‌కుమార్, కె.నీలాదేవి, గజ్జల సంపూర్ణ, కె.శ్రావణ్‌కుమార్, గజ్జల సూర్యనారాయణ, తులసీ, లక్ష్మి, మేరీ, మంజుల, రాజుచారి, జనార్దన్, జీ.ఎల్. రాజేష్, సందీప్, ఆర్.జే.దేవ్, మహ్మద్ మొయిన్, సాబీర్ తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం..

దాయర, జెమిస్తాన్‌పూర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాయర మార్కెట్‌లో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు నిర్వహకులు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు పరకాల రజనీకాంత్‌గౌడ్, సభ్యులు కర్ణ ప్రకాష్, మనోజ్‌కుమార్‌గౌడ్, జనార్ధన్, దయానంద్‌గౌడ్, ఆగిరెడ్డి, మల్లేష్‌గౌడ్, పాండురంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, కిషన్ రామ్, మల్లికార్జున్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ముదిగొండ మురళీ, శంకర్‌ముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, బల్లా శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు కేక్ తినిపిస్తున్న ముఠా జైసింహ



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఇస్త్రీ చేస్తూ.. గుండెపోటుతో మహిళ మృతి

చిక్కడపల్లి: ఇస్త్రీ చేస్తూ.. మహిళ గుండెపోటుతో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. వివేక్‌నగర్‌కు చెందిన దమగల్ల స్వరూప (50) రజక సామాజిక వర్గానికి చెందిన గృహిణి బట్టలు ఇస్త్రీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను చదివించారు. ఆమె భర్త నర్సింగరావు కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. అప్పట్నుంచి చుట్టుపక్కల వారి బట్టలతో పాటు హాస్టళ్లలో ఉండే పోటీపరీక్షల అభ్యర్థుల బట్టలు ఇస్త్రీ చేస్తూ.. వచ్చే ఆదాయంతో ఆమె కుటుంబాన్ని పోషించేది. కాగా బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో బట్టలు ఇస్త్రీ చేస్తుండగా.. గుండెపోటు వచ్చింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ముఠాజైసింహ తదితరులు హాజరై నివాళులర్పించారు.